సాగునీరు పారేదెలా?

- పూడుకుపోయిన కాలువలు
- ముంచుకొస్తున్న తొలకరి
- కలవరపడుతున్న రైతులు



గొల్లపాలెంలో పూడికతో మూసుకుపోయిన పంటకాలువ

కాజులూరు: డెల్టా ప్రాంతంలోని వ్యవసాయ భూముల్లో 90 శాతం రైతులు ఖరీఫ్, రబీల్లో వరి సాగుకే ప్రాధాన్యం ఇస్తుంటారు. కొద్ది రోజుల్లో తొలకరి సాగు ప్రారంభం కానుంది. గోదావరి డెల్టా ప్రధాన కాలువల నుంచి పంటబోదెలు (పిల్ల కాలువలు) ద్వారా పొలాలకు సాగునీరు సరఫరా జరుగుతుంది. అయితే నియోజకవర్గ గ్రామాల్లోన్ని ప్రధాన కాలువలకు అనుసంధానంగా ఉన్న పంట బోదెలో పూడికలు పెరిగిపోయి అధ్వానంగా తయారవడంతో సాగునీరు పొలాలకు చేరడం కష్టతరంగా మారుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కోరంగి కెనాల్, ఇంజరం కాలువలకు అనుసంధానంగా ఉన్న సుమారు 200 పంట కాలువల ద్వారా ఈ పొలాలకు సాగునీటి సరఫరా జరుగుతుంది. వారం రోజుల క్రితమే గోదావరి డెల్టా కాలువకు నీటి విడుదల చేశారు. అయితే పిల్లకాలువలు కొన్ని చోట్ల పూడుకుపోయి ఉండగా మరి కొన్ని చోట్ల తూడు, గుర్రపుడెక్కతో మూసుకుపోయాయి. దీంతో పొలాలకు సాగునీరు సకాలంలో సరఫరా అయ్యే పరిస్థితులు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. నియోజకవర్గంలో మొత్తం 62500 ఎకరాల సాగుభూమి ఉండగా ఈ ఏడాది తొలకరిలో సుమారు 52 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టనున్నట్లు అధికారులు అంచనా. గతంలో తొలకరి, దాళ్వా వ్యవసాయ పనుల ప్రారంభానికి ముందే పంటకాలువల తవ్వకాలు జరిగేవి. నీటి తీరువా సొమ్ములు, నీటి సంఘాల ద్వారా మంజూరయ్యే నిధులతో పాటు రైతులు స్వచ్ఛంద సహకారాలతో ఈ పనులు పూర్తి చేసుకునేవారు. ఆపై కొంతకాలంగా ఉపాధి పనుల్లో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది కూలీలతో పంటకాలువల తవ్వకాలు నిర్వహిస్తున్నారు. అయితే ఉపాధి పనుల నిర్వహణలో సిబ్బంది వారి నిబంధనలకు లోబడి మాత్రమే కాలువల తవ్వకం పనులు నిర్వహించడంతో రైతన్నల నుంచి సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో నీటిసంఘాలకు నిధులు ఇచ్చేవారని దీంతో అవసరమైన మేర కాలవలు తవ్వుకునేవారమని ఆపై ఉపాధి పథకం ద్వారా కాలవలు తవ్వినా పైపైనే తవ్వకాలు జరగడంతో కాలువల్లో పూడిక పెరిగిపోయి ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు చెబుతున్నారు. కొన్ని చోట్ల ప్రధాన కాలువల నుంచి పిల్ల కాలువలకు నీరు వచ్చే స్లూయిజ్‌ల వద్ద తూడు, గుర్రపుడెక్క దట్టంగా పేరుకుపోయాయి. పంట కాలువలు మూసుకుపోవడంతో ఏటా కాలువ శివారు ఉన్న భూములకు చుక్క నీరందక దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నామని కాలువ శివారు భూముల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



టి.మామిడాడలో స్లూయిజ్ వద్ద నీటి ప్రవాహానికి అడ్డుగా పెరిగిన గుర్రపుడెక్క

సాగు నీరు అందడం లేదు



పొలాలకు సాగునీరందించే పంటకాలువలు పూడుకుపోవటంతో శివారు భూములకు నీరందడం లేదు. ఫలితంగా కాలువనీరు వదలిన వర్షాలు వస్తే కాని పంటదమ్ములు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

– నల్లమిల్లి అచ్చిరెడ్డి, రైతు మొగలిపాలెం

కాలువలు తవ్వించాలి



పంటకాలువలు పూడుకుపోవటంతో నీటి ఎద్దడి సమయంలో కాలువ శివారు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. సాగు ప్రారంభించే లోపు పంటకాలువలను తవ్వాల్సిన అవసరం ఉంది.

– గోవాల కామరాజు రైతు గొల్లపాలెం

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రతిభ కనబర్చిన విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న పరమేశ్వర

కపిలేశ్వరపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మండల పరిధి అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాలలో గురువారం నిర్వహించిన సదస్సులో పాల్గొన్న వక్తలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.రమణ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో రిటైర్డ్ ఉపాధ్యాయులు వాకా పరమేశ్వర, శాస్త్రవేత్త డాక్టర్ దివ్యశేఖర్, కళాశాల కరస్పాండెంట్ రాజా మాట్లాడుతూ భావిభారత తరాల వారికి ప్రకృతి సిద్ధమైన జీవితాలను ప్రసాదించేందుకు సహజ వనరులను కాపాడుకోవాలన్నారు. అనంతరం 2023–24 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబర్చిన కళాశాలకు చెందిన ప్రథమ, ద్వితీయ ఇంటర్మీడియెట్ విద్యార్థులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన గ్రామీణ ప్రాంత విద్యార్థులను అభినందించారు.

మలేరియాపై అవగాహన అవసరం



తాతపూడిలో మలేరియాపై మాట్లాడుతున్న రామారావు తదితరులు

కపిలేశ్వరపురం: మలేరియా వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అంగర పీహెచ్‌సీ హెచ్ఈ బి.రామారావు, ఆరోగ్య కార్యకర్త వెన్నేటి వెంకటేశ్వరరావు అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి గ్రామాల్లో గురువారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ పి.రత్నకుమారి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల బెడదను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య కార్యకర్త తోటకూర రామకృష్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన ఎమ్మెల్యే సుభాష్




చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలసిన ఎమ్మెల్యే సుభాష్

రామచంద్రపురం: నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన వాసంశెట్టి సుభాష్ టీడీపీ అధినేత నారా చంద్రబాబును గురువారం మంగళగిరిలో మర్యాద పూర్వకంగా కలిశారు. విజయం సాధించిన అనంతరం తొలుత విజయవాడలోని కనకదుర్గమ్మ అమ్మవారిని సుభాష్ దర్శించుకున్నారు. అనంతరం చంద్రబాబును, నారా లోకేష్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.

ప్రజలకు మంచి చేయండి

కె.గంగవరం: రామచంద్రపురం ఎమ్మెల్యేగా వాసంశెట్టి సుభాష్ గెలుపొందడంపై సత్యవాడ గ్రామంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు గురువారం మొక్కులు తీర్చుకున్నారు. స్థానికంగా ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కార్యకర్తలు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలుపొందిన సుభాష్ ప్రజలకు మంచి చేయడంతో పాటు గ్రామాన్ని, మండలాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సలాది ప్రకాష్, సలాది వెర్రి బాబు, ఎంపీటీసీ సలాది రమేష్, బండారు బద్రి, చిన్న, శివ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



ఆలయంలో కొలువైన ముత్యాలమ్మ వారు

కె.గంగవరం: గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర, తీర్థాన్ని గ్రామస్తులు నిర్వహించారు. బుధవారం సాయంత్రం ఆలయం వద్ద జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం సాయంత్రం ఆలయం వద్ద నిర్వహించిన తీర్థంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ఎదుట ఏర్పాటు చేసి దుకాణాల్లో ఆట బొమ్మలు కొనుగోలు చేశారు. జాతర తీర్థం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయం వద్ద కె.గంగవరం ఎస్సై జానీ బాషా బందోబస్తు నిర్వహించారు.

వరి విత్తనాలను సరఫరా చేయాలి

కాజులూరు: రైతులకు అవసరమైన వరి విత్తనాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలని డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ తదితరులు డిమాండ్ చేశారు. గురువారం కాజులూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ ఏటా రైతులకు నాణ్యమైన విత్తనాలు లభించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కొందరు రైతులు వరి విత్తనాలను సొంతంగా పండిస్తున్నప్పటికీ మండల గ్రామాల్లో రైతులకు సరఫరా సరిపోవడం లేదని దీంతో రైతులందరూ బయట మార్కెట్‌లో అధిక ధరలు వెచ్చించి విత్తనాలను కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు అవసరమైన వరి విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలన్నారు.

రేపు రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం

కపిలేశ్వరపురం: రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ మండపేట శాఖ సమావేశం ఈ నెల 8న మండపేటలోని శ్రీరామా హిందూ మున్సిపల్ యూపీ స్కూల్‌లో నిర్వహించనున్నట్టు కపిలేశ్వరపురం మండలం వల్లూరుకు చెందిన అసోసియేషన్ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో పెన్షనర్ల సమస్యలపై చర్చించనున్నామన్నారు.

12(1)సి అడ్మిషన్లకు నేడు తుది గడువు

జిల్లాలో రెండో విడతలో 754 మందికి అవకాశం

రాయవరం: విద్యా హక్కు చట్టంలో భాగంగా పేద విద్యార్థులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అడ్మిషన్లకు అవకాశం కల్పించే 12(1)సి అడ్మిషన్లకు శుక్రవారం తుదిగడువుగా విధించారు. ఇప్పటికే మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కాగా, రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియకు రాష్ట్ర విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 754 చిన్నారులకు అడ్మిషన్లు కల్పించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అడ్మిషన్లకు తుది గడువు శుక్రవారం సాయంత్రం ముగియనుండడంతో జిల్లా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పరామర్శ

రాయవరం: పసలపూడిలో ప్రమాదవశాత్తు గాయపడిన దూళి నాగార్జున, దూళి విజయకుమార్‌లను మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ గురువారం పరామర్శించారు. ఇటీవల నాగార్జున, విజయకుమార్ ప్రమాదంలో గాయపడ్డారు. వారి కుటుంబాలకు జనసేన అండగా ఉంటుందని లీలాకృష్ణ హామీ ఇచ్చారు.

జాబ్ మేళాలో 30 మంది విద్యార్థుల ఎంపిక



తమ కంపెనీలో నిర్వర్తించాల్సిన విధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఆర్ సాయిచక్ర

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో శ్రీనివాస శైల ఐటీఐ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చోడి సత్యనారాయణ తెలిపారు.

కాకినాడకు చెందిన రామకృష్ణ ఎలక్ట్రికల్ వర్క్స్ కంపెనీ నిర్వహించిన ఈ జాబ్ మేళాలో కంపెనీ హెచ్ఆర్ నేరెళ్ల సాయిచక్ర ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరికి కాకినాడలో రూ.12 వేలు భత్యంగా అందించి సంవత్సరం పాటు శిక్షణ అందజేసి ఉద్యోగాలను కల్పించనున్నట్లు కళాశాల యాజమాన్యం యనమదల శ్రీనివాస్, నల్లజర్ల వెంకటగిరి శ్రీనివాస్, గంగిశెట్టి భీమేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చోడి సూర్యప్రకాశ్, డి.జయ, టి.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాతీర్పును గౌరవిస్తున్నాను

- కూటమి నేతలకు శుభాకాంక్షలు
- మండపేటలోనే ఉంటూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా నిలుస్తా
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మండపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

మండపేట: అత్యధిక మెజారిటీతో ఏర్పాటు అయిన కూటమి ప్రభుత్వానికి, కూటమి నేతలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శుభాకాంక్షలు తెలిపారు. మండపేటలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఎన్నికల ఫలితాలనంతరం తొలిసారి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కారణాలేమైనా ప్రజలు తమ ప్రభుత్వాన్ని వ్యతిరేకించారని అర్థమవుతుందన్నారు. అందుకు గల కారణాలను విశ్లేషించుకుంటామన్నారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమని, తాను నాలుగు సార్లు గెలుపొందగా, నాలుగు సార్లు ఓటమిని చూశానన్నారు. మహా నాయకులుగా కీర్తించే మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావులు సైతం ఓటమిని చవిచూశారన్నారు. 1994 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 26 సీట్లతో ప్రతిపక్ష హోదాను కోల్పోయిందని గుర్తు చేశారు. మండపేట నియోజకవర్గంలోని కార్యకర్తలకు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముందు ఏ సమస్యను ప్రస్తావించినా గత ఐదేళ్లుగా ప్రతిపక్షంలో ఉండడంతో ఏమీ చేయలేకపోతున్నానని చెబుతూ వచ్చారని, ఈ ఎన్నికలతో అధికార పక్షంలోకి వచ్చిన నేపథ్యంలో నియోజకవర్గాన్ని ఏవిధంగా అభివృద్ధి చేస్తారో చూడాలన్నారు. మండపేట నుంచి వెళ్లిపోతానంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, స్థానికంగానే ఉంటూ అందరికీ అండగా నిలుస్తానన్నారు. సమావేశంలో మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, మండపేట పట్టణ, రూరల్ పార్టీ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, నాయకులు పెంకే గంగాధరం, సాధనాల శివ భగవాన్ పాల్గొన్నారు.

కొత్తపేటలో మూడోస్థానం 'నోటా'దే

- నోటాకు 1558 ఓట్లు
- పోస్టల్ బ్యాలెట్లలో చెల్లనివి 95



కొత్తపేట: జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రజాతీర్పుకు సంబంధించి కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన టీడీపీ, వైఎస్సార్ సీపీ అభ్యర్థుల తరువాత అభ్యర్థుల కంటే 'నోటా'కే ఎక్కువ ఓట్లు పడ్డాయి. నోటా మూడోస్థానం దక్కించుకుంది. పోస్టల్ బ్యాలెట్లలో 95 ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. నియోజకవర్గంలో మొత్తం 13 మంది అభ్యర్థులు పోటీ చేయగా వారిలో విజేతగా నిలిచిన టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావుకు ఈవీఎం అండ్ పోస్టల్ బ్యాలెట్ల ద్వారా 1,34,286 ఓట్లు పడగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డికి 77,807 ఓట్లు పడ్డాయి. వారి తరువాత నోటాకు 1,575 ఓట్లు పడ్డాయి. 2,204 పోస్టల్ బ్యాలెట్స్ పోలవగా వాటిలో 17 నోటాకు పడ్డాయి. 95 బ్యాలెట్ ఓట్లు చెల్లకుండా పోయాయి.

ఇతర అభ్యర్థులకు పోస్టల్ బ్యాలెట్లతో కలిపి పడిన ఓట్ల వివరాలు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఈశ్వరరావు రౌతుకు 1,146 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి కాండ్రు వెంకటేశ్వరావుకు 585, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి అరుణకిరణ్ సత్యాలకు 429, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దడాల చంద్రరావుకు 130, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండారు శ్రీనివాసరావుకు 92, స్వతంత్ర అభ్యర్థులు బొచ్చా శ్రీనివాసరావు (గాజు గ్లాసు గుర్తు) 685, మెర్ల శాస్త్రులుకు 69, రాయుడు రాజుకు 194, సలాది వీవీడీ సత్యనారాయణమూర్తికి 194, ఎ.సుధాకర్‌కు 244, సుంకర లక్ష్మీమణికుమారికి 145 ఓట్లు పడ్డాయి.

డిపాజిట్ కోల్పోయిన 11 మంది అభ్యర్థులు

ఈ ఎన్నికల్లో పోటీ చేసిన 13 మందిలో ప్రధాన టీడీపీ, వైఎస్సార్ సీపీ అభ్యర్థులు మినహా మిగిలిన 11 మంది డిపాజిట్ కోల్పోయారు. (అభ్యర్థికి పోలై చెల్లిన ఓట్లలో 1/6 వంతు ఓట్లు (ప్రతి 6 ఓట్లలో 1 ఓటు) పడితే డిపాజిట్ దక్కుతుంది. నామినేషన్ వేసినప్పుడు ఎన్నికల అధికారి వద్ద డిపాజిట్ చేసిన నగదును అభ్యర్థికి తిరిగి చెల్లిస్తారు.) అలా పై 11 మందికి తగిన ఓట్లు పడకపోవడంతో డిపాజిట్ కోల్పోయారు.

పార్లమెంట్ ఓట్లు ఇలా..

అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎంల ద్వారా టీడీపీ అభ్యర్థి జీఎం హరీష్ (బాలయోగి)కి 1,34,769 ఓట్లు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌కు 74,858 ఓట్లు పడ్డాయి. ఇక్కడ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్ జరిగింది. అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి జగ్గిరెడ్డికి ఈవీఎంల ద్వారా 77,098 ఓట్లు పడగా, ఎంపీ అభ్యర్థి రాపాకకు 74,858 ఓట్లు పడ్డాయి. అలా జగ్గిరెడ్డి 2,240 ఓట్లు ఎక్కువ సాధించారు. టీడీపీ అభ్యర్థుల విషయంలో రివర్స్ అయ్యింది. టీడీపీ ఎంపీ అభ్యర్థి జీఎం హరీష్‌కు 1,34,769 ఓట్లు పడగా అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావుకు 1,32,951 ఓట్లు పడ్డాయి. బండారు కంటే హరీష్ 1,818 ఓట్లు ఎక్కువ సాధించారు. ఆ విధంగా ఈ నియోజకవర్గంలో జగ్గిరెడ్డికి ఓటు వేసిన ఓటర్లలో 2,240 మంది పార్లమెంట్ ఈవీఎంలలో రాపాకకు కాకుండా ఇతర అభ్యర్థులకు ఓటు వేశారు.

అంగరలో కూటమి విజయోత్సవాలు



అంగర గాంధీ సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొంటున్న నాయకులు


కపిలేశ్వరపురం: అంగర గాంధీ సెంటర్‌లో బుధవారం రాత్రి అంగర, పడమర ఖండ్రిక గ్రామాలకు చెందిన జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూటమి విజయోత్సవ సంబరాలను జరుపుకొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లీలాకృష్ణ, టీడీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్ కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. లీలాకృష్ణ మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీల సమన్వయం, క్షేత్ర స్థాయిలో కార్యకర్తల పని తీరు ఫలితంగా నూతన ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అదే ఉత్సాహంతో భవిష్యత్‌లోనూ కొనసాగుతూ ప్రజలకు మేలు చేయగలరని ఆకాంక్షించారు. ఇరు పార్టీల నాయకులు పిల్లా బసవరాజు, చీకట్ల గంగరాజు, మత్సా గంగరాజు, సుంకర బుజ్జి, మేడేపల్లి కనక రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గొల్లాలమ్మ జాతర


ఆలమూరు: మండలంలోని పినపళ్లలో వేంచేసిన గొల్లాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. రంగుల కాగితాలతో అలంకరించిన గరగతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించగా మహిళలు పసుపు, కుంకుమ, చీర, రవికలు సమర్పించారు. గొల్లాలమ్మ అమ్మవారిని తాటి పట్టెలపై ఊరేగించడం, చీరలపై నడిచి పుట్టింటికి వెళ్లి ఆడపడుచు లాంచనాలు స్వీకరించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. స్థానిక గానుగ చెట్టు వీధి, ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నృత్య కళాకారులు చేపట్టిన గవ్వ నృత్యం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. గవ్వ నృత్య కళాకారుడికి కోళ్లను నైవేద్యంగా అందించి గ్రామస్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. గ్రామం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు తమ తమ చంటిపిల్లలతో కాగడాలు వెలిగించి కావిడి కోళ్ల సమర్పించారు. భక్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయితే బుధవారం రాత్రి ఏకధాటిగా కురిసిన భారీ వర్షంతో జాతరకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఎంచుకోండి.. అధిక దిగుబడి పొందండి

- ఖరీఫ్‌కు అనువైన వరి రకాలు
- నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు



కొప్పిశెట్టి ప్రభాకర్



నారుమడిని సిద్ధం చేసుకుంటున్న రైతులు



స్వర్ణ రకం వరి

రాయవరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. తొలకరి పలకరించడంతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే బోర్లపై సాగు చేసే వారు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. కాలువల ద్వారా నీరు కూడా విడుదల కావడంతో మిగిలిన రైతులు నారుమడులు వేసే పనిలో పడ్డారు. ఈ సమయంలో ఖరీఫ్‌కు అనువైన వరివిత్తనాల వివరాలను రాయవరం మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ ఇలా వివరిస్తున్నారు.

ఎంటీయూ 7029 (స్వర్ణ)

అధిక సంఖ్యలో రైతులు సాగు చేసేది స్వర్ణ రకాన్నే. ఇంచుమించు 80 శాతం మంది రైతులు ఎక్కువగా ఖరీఫ్‌లో ఈ రకాన్నే సాగు చేస్తున్నారు. స్వర్ణ 155 రోజులకు కోతకు వస్తుంది. ఎక్కువగా గాలికి, వర్షానికి పడిపోయే స్వభావంతో పాటు తెగుళ్లను అంతగా తట్టుకోక పోయినా ఇది ఎటువంటి పరిస్థితుల్లోనైనా దిగుబడి బాగా ఇస్తుంది. అందుకే రైతులు ఎక్కువగా దీని వైపు మొగ్గు చూపుతున్నారు. స్వర్ణ ఎకరాకు 30–35 బస్తాల దిగుబడి వస్తుంది. రైతులు స్వర్ణ రకాన్ని దిగుబడిలో బంగారంగా పేర్కొంటారు.

ఎంటీయూ1318

సార్వాలో స్వర్ణకు ప్రత్యామ్నాయంగా దీనిని మార్టేరు వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు రూపొందించారు. ఇది నూతన వరి వంగడం. దీని పంట కాలం 155–160 రోజులు. స్వర్ణకు ప్రత్యామ్నాయం. తెగుళ్లను తట్టుకుంటుంది. ముఖ్యంగా పాము పొడ తెగులు, దోమపోటు, అగ్గితెగులును తట్టుకోవడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాల సమయంలో గాలులకు ఒరిగిపోకుండా అధిక దిగుబడులనిస్తుంది. నీటి వసతి అధికంగా ఉన్న ప్రాంతాల రైతులు ఈ వరి వంగడాన్ని సాగు చేయాలి. ముంపు ప్రాంతాలకు ఇది అనువైన రకం.

బీపీటీ 5204 (సాంబమసూరి)

సాంబమసూరి పంట కాలం 155 నుంచి 160 రోజులు. ఇది సన్నరకం ఫైన్ క్వాలిటీ. మన ప్రాంతంలో రైతులు ఎక్కువగా వారి తిండి అవసరాల కోసం దీన్ని పండిస్తారు. దీనికి బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. అందుకే రైతులు ఎక్కువగా దీన్ని సాగు చేయడం లేదు.

ఎంటీయూ1061 (ఇంద్ర)

స్వర్ణ రకం మాదిరిగానే 150 నుంచి 155 రోజుల్లో పంటకు వస్తుంది. ముంపు ప్రాంతాలైన బాడవల్లో దీన్ని సాగు చేసుకోవచ్చు. ఎందుకంటే ఎక్కువ రోజులు నీటిలో ఉన్నా పంటకు నష్టం ఉండదు. వర్షాలకు, గాలికి పడిపోయే గుణం తక్కువ. స్వర్ణకు ప్రత్యామ్నాయంగా దీన్ని సాగు చేసుకుంటే మంచిది.

ఎంటీయూ 1064

తొలకరిలో స్వర్ణకు ప్రత్యామ్నాయంగా తయారు చేసిన రకం. పంట కాలం 145 నుంచి 150 రోజులు. ఎకరాకు 25 నుంచి 30 బస్తాల దిగుబడి వస్తుంది. స్వర్ణకు ధీటుగా దిగుబడిని ఇవ్వడం లేదనే కారణంతో రైతులు ఎక్కువగా ఆసక్తి చూపడం లేదు. ముంపు ప్రాంతాలకు కూడా ఇది అనువైన రకం.

ఎంటీయూ 1075

ఈ వరి ఎక్కువ పొడవుగా ఎదుగుతుంది. పడిపోయే గుణం తక్కువ. దీని పంట కాలం 145 నుంచి 150 రోజులు. దిగుబడి ఎకరాకు 25 నుంచి 28 బస్తాల వరకు వస్తుంది.

ఎంటీయూ 1121

ఇది ఫైన్ క్వాలిటీ సన్న రకం. దీని యొక్క పంట కాలం 150 రోజులు. ఇది కొంత వరకు దోమను తట్టుకుంటుంది. ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుంది.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారిని గురువారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. వైశాఖ బహుళ అమావాస్య పర్వదినం పురస్కరించుకుని దేవదాయ–ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వామివారి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి శనివారం మాదిరిగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తైలాభిషేకాలు, పూజల ద్వారా దేవస్థానానికి రూ.1,33,075, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.10,620తో కలిపి మొత్తం రూ.1,43,695 ఆదాయం వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ విజయలక్ష్మి తెలిపారు. పట్టిసీమకు చెందిన భక్తుడు సత్యనారాయణ గుప్తా అన్నదానం పథకానికి రూ.10,120 విరాళంగా అందజేసినట్టు తెలిపారు. పలువురు ప్రముఖులు, అధికారులు స్వామిని దర్శించుకున్నారు.



మందపల్లి శనైశ్చరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు